
సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 13 । ఏప్రిల్ । 2024



ఓటరు జాబితాలో మీ పేరుందా?

ఎన్నికల జాబితాలో ఓటు లేకపోతే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకూ ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. - 8లో▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
39.2° / 26.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	39.0	24.0
కాకినాడ	35.1	26.5
అమలాపురం	39.2	26.0

న్యూస్‌రీల్

విద్యుత్‌కు నేడు 7 గంటల పాటు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరు విద్యుత్ ఉపకేంద్రంలో 33 కేవీ విద్యుత్ లైన్లకు శనివారం అత్యవసర మరమ్మతులు చేపట్టనున్నారు. అందువలన జిల్లావ్యాప్తంగా పలు నియోజకవర్గాల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎస్‌ఈ టీవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజానగరం నియోజకవర్గం శ్రీకృష్ణపట్నం, రాధేయపాలెం, అనపర్తి నియోజకవర్గం మహేంద్రవాడ, ద్వారపూడి, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం, వేమగిరి, నామవరం, శాటిలైట్ సిటీ, పిట్లవాని చెరువు, బొమ్మూరు, ఆల్కాట్ గార్డెన్స్, ఆవ వాంబే కాలనీ, తూర్పు రైల్వే స్టేషన్ రోడ్, బాలాజీపేట, ధవళేశ్వరం పరిసర ప్రాంతాలు, శంభు నగర్, టి.నగర్, ఇన్నీసుపేట, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో తాడితోట ఇండస్ట్రియల్ కాలనీ, రెల్లిపేట, ఆంధ్ర నగర్, గోరక్షణ పేట, పాత సోమాలమ్మ గుడి వీధి, దానవాయిపేట, ప్రకాష్ నగర్, తిలక్ రోడ్, వీఎల్ పురం, మార్గాని ఎస్టేట్స్, రామాలయం సెంటర్, శ్రీ వేంకటేశ్వర జనరల్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

16న భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

కాకినాడ సిటీ: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో సీతారామచంద్రస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు 16వ తేదీ ఉదయం 6, 8, 10 గంటలకు కాకినాడలో బయలుదేరుతాయన్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవం పూర్తయిన తరువాత ఈ బస్సులు భద్రాచలంలో 17వ తేదీ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ తిరుగు పయనమవుతాయని తెలిపారు. ఈ బస్సులకు సాధారణ చార్జీ మాత్రమే వసూలు చేస్తారన్నారు. ప్రతి రోజూ కాకినాడ నుంచి తిరిగే ఏడు సర్వీసులకు అదనంగా ఈ బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు.

రాములోరి పెళ్లికి పందిరి రాట

అన్నవరం: రత్నగిరి క్షేత్ర పాలకుడు శ్రీ సీతారామచంద్రస్వామి వారి శ్రీరామ నవమి వేడుకలకు పండితులు శుక్రవారం పందిరి రాట వేశారు. రత్నగిరిపై రామాలయం వద్ద ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. పండితులు తొలుత పందిరి రాటకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెట్టి, పూలతో అలంకరించి, పూజలు చేశారు. అనంతరం వేదమంత్రోచ్చారణతో రాట ముహూర్తం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణారావు, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, రామాలయ అర్చకులు దేవులపల్లి ప్రసాద్, పురోహితులు పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకూ తొమ్మిది రోజుల పాటు రత్నగిరిపై శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తిని వధూవరులుగా అలంకరించడంతో శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభమవుతాయి. 17వ తేదీ శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహిస్తారు. 18, 19, 20, 21 తేదీల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు, 22న వనవిహారోత్సవం, 23న శ్రీచక్రస్నానం, దండియాడింపు ఉత్సవాలు నిర్వహిస్తారు. 24వ తేదీ రాత్రి శ్రీపుష్పయాగంతో శ్రీరామ నవమి వేడుకలు ముగుస్తాయి.

మన స్థానం 5



- ఇంటర్ ఫలితాల విడుదల
- 85 శాతం విద్యార్థుల ఉత్తీర్ణత
- గతంకన్నా మెరుగుదల
- ఫస్టియర్‌లో 76 శాతంతో బాలికల ముందంజ
- ద్వితీయ సంవత్సరంలో 84 శాతంతో బాలుర పైచేయి
- మే 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది ఎనిమిదో స్థానంలో నిలిచిన మన జిల్లా ఈసారి మూడు స్థానాలు ఎగబాకి, ఐదో స్థానానికి చేరుకుంది. జిల్లాలో గత ఏడాది 83 శాతం మంది విద్యార్థులు పాసవగా.. ఈసారి 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షలు గత నెల ఒకటి నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించిన విషయం విదితమే. ఫస్టియర్, సెకండియర్, జనరల్, ఒకేషనల్ ఫలితాలను స్వల్ప వ్యవధిలోనే ఒకేసారి విడుదల చేయడం విశేషం. మొదటి సంవత్సరంలో 76 శాతం ఉత్తీర్ణతతో బాలికలు ముందంజలో నిలవగా, బాలురు 75 శాతం ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరంలో బాలురు 84 శాతం, బాలికలు 83 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 19,039 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 14,357 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో సంవత్సరం పరీక్షలు 15,394 మంది రాయగా వీరిలో 12,837 మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది ఫస్టియర్ 59 శాతం, సెకండియర్ 69 శాతం చొప్పున ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ ఏడాది దీనిని అధిగమించారు. ఉత్తీర్ణత, మార్కుల్లో తేడాలు ఉన్నట్లు అనిపిస్తే రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. ఫెయిలైన విద్యార్థులకు వచ్చే నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌కు మే ఒకటి నుంచి నాలుగో తేదీ వరకూ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి.

ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్ల ఉత్తీర్ణత వివరాలు..

- 2020లో ఫస్టియర్ పరీక్షలు 48,578 మంది రాయగా, 28,277 మంది (58.21 శాతం) ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ పరీక్షలకు 49,479 మంది హాజరు కాగా, 25,975 మంది (57.11 శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- 2021లో కరోనా పరిస్థితుల నేపథ్యంలో పరీక్ష ఫీజు కట్టిన వారందరూ ఉత్తీర్ణులైనట్లు ప్రకటించారు. ఆ ఏడాది బాలురు 36,535 మంది, బాలికలు 41,689 మంది కలిపి మొత్తం 78,224 మంది పాసయ్యారు. మొదటి సంవత్సరం మార్కులు, పదో తరగతిలో వచ్చిన 30 శాతం మార్కుల వెయిటేజీ కలిపి నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు.
- 2022లో ఫస్టియర్ పరీక్షలు 32,890 మంది రాయగా, 18,895 మంది(57 శాతం) పాసయ్యారు. సెకండియర్ పరీక్షలకు 41,446 మంది హాజరవగా, 23,954 మంది (58 శాతం) ఉత్తీర్ణులయ్యారు.
- 2023లో ప్రథమ సంవత్సరం పరీక్షలకు 42,137 మంది హాజరు కాగా, 24,886 (59 శాతం) పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 36,835 మంది రాయగా, 25,330 (69 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ఉమ్మడి జిల్లాలో సీఎం జగన్
ఎన్నికల శంఖారావం



- 16న రాజమహేంద్రవరం చేరనున్న బస్సు యాత్ర
- 18న రావులపాలెంలో 'మేమంతా సిద్ధం' సభ
- విజయవంతం చేయాలని నేతల పిలుపు

రాజమహేంద్రవరం సిటీ/సాక్షి, అమలాపురం/రావులపాలెం: సంక్షేమ రథ సారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఆయన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈ నెల 16 నుంచి జిల్లాలో జరగనుంది. దీనిని విజయవంతం చేసేందుకు నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వివరాలను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్లు పి.మిధున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌లు రావులపాలెం సీఆర్‌సీలో శుక్రవారం విలేకర్లకు వెల్లడించారు. సీఎం జగన్ పర్యటన వివరాలను మిధున్‌రెడ్డి వివరించారు. ఈ నెల 15న భీమవరంలో సిద్ధం సభ ముగించుకుని సీఎం జగన్ రాజమహేంద్రవరం చేరుకుంటారన్నారు. 16వ తేదీన రాజమహేంద్రవరంలో రోడ్డు షో నిర్వహించి, అక్కడే బస చేస్తారని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా 17న ప్రచారానికి సెలవు ప్రకటించారని, తిరిగి 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రావులపాలెంలో జరిగే 'మేమంతా సిద్ధం' సభలో పాల్గొంటారన్నారు. ఈ సభకు సుమారు 2 లక్షల మంది వస్తారనే అంచనాతో పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీఎం జగన్ సభను విజయవంతం చేయాలని కోరారు. సభ అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ వెళతారన్నారు. సిద్ధం సభా వేదికపై జిల్లాలోని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తారని మిధున్‌రెడ్డి, విశ్వరూప్ తెలిపారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ, త్వరలో జరిగే ఎన్నికలు ప్రజల కోసం పని చేస్తున్న వైఎస్సార్ సీపీకి, స్వలాభం కోసం జత కట్టిన మూడు పార్టీలకు మధ్య జరుగుతున్నాయన్నారు. 71 ఏళ్ల దేశ ఎన్నికల చరిత్రలో మేనిఫెస్టోను వంద శాతం అమలు చేసింది సీఎం జగన్ ఒక్కరేనన్నారు. ఇది పార్టీకి కలిసివచ్చే అతి పెద్ద అంశమని, ప్రజలు దీనిని గుర్తించారని, ఎంతమంది జత కట్టినా వైఎస్సార్ సీపీపై గెలవడం సాధ్యం కాదని చెప్పారు. సమావేశంలో పార్టీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు చిర్ల జగ్గిరెడ్డి, తోట త్రిమూర్తులు, విప్పర్తి వేణుగోపాలరావు, గొల్లపల్లి సూర్యారావు, పిల్లి సూర్యప్రకాశరావు, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. అంతకుముందు మిధున్‌రెడ్డి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులు, ప్రచారం తీరుతెన్నులు తెలుసుకున్నారు.



రావులపాలెంలో మేమంతా సిద్ధం పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు మిధున్‌రెడ్డి, బోస్, మంత్రి విశ్వరూప్ తదితరులు

రాజమహేంద్రవరంలో యాత్రను విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న రాజమహేంద్రవరం నగరంలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని స్థానిక ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ బస్సు యాత్ర నేపథ్యంలో పార్టీ ఇన్చార్జులు, అబ్జర్వర్లతో తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. సీఎం జగన్ బస్సు యాత్రను దిగ్విజయం చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులందరిపై ఉందని అన్నారు. ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు సీఎం జగన్ బస్సు యాత్ర నగరానికి చేరుతుందన్నారు. కాతేరు నుంచి గామన్ బ్రిడ్జి మీదుగా మల్లయ్యపేట, ఏపీ పేపర్ మిల్లు, సీతంపేట, కంబాల చెరువు, జాంపేట, ఆజాద్ చౌక్, చర్చిపేట, అప్సరా థియేటర్, సాయికృష్ణ థియేటర్ మీదుగా డీలక్స్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్ వరకూ సాగుతుందని తెలిపారు. సీఎం జగన్‌కు పెద్ద ఎత్తున స్వాగతం పలికి, ఆయన రోడ్డు షో ముగిసే వరకూ పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు, పార్టీ అభిమానులు, నగర ప్రజలు అన్ని డివిజన్ల నుంచి తరలివచ్చేలా ఆయా డివిజన్ల ఇన్చార్జులు కృషి చేయాలని ఎంపీ భరత్‌రామ్ కోరారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నందెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్. చిత్రంలో రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

రెక్కలు కట్టుకుని వచ్చేస్తారు

- జిల్లాలో 440 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు
- రాజమహేంద్రవరం సిటీలో 175 మంది
- ఎన్నికల వేళకు వచ్చేందుకు సన్నాహాలు

నియోజకవర్గాల వారీగా ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు

నియోజకవర్గం	ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు
అనపర్తి	17
రాజానగరం	11
రాజమహేంద్రవరం రూరల్	22
రాజమహేంద్రవరం సిటీ	175
నిడదవోలు	93
కొవ్వూరు	73
గోపాలపురం	49

రాజమహేంద్రవరం రూరల్: గోదావరి జిల్లాల్లో ఫలితం ఎటు? అనపర్తిలో నిలిచేదెవరు? రాజానగరంలో సత్తా చాటెదెవరు? రాజమహేంద్రవరం రూరల్‌లో గెలుపు ఎవరిది? రాజమహేంద్రవరం సిటీలో చిందేసేది ఎవరు? నిడదవోలులో పెత్తనం ఎవరిది? కొవ్వూరు నుంచి అసెంబ్లీలో వాణి వినిపించేదెవరు? గోపాలపురంలో మళ్లీ ఎలా ఉండబోతోంది?.. సార్వత్రిక ఎన్నికల వేళ ఓటర్లలో ఇటువంటి ఆసక్తి ఉండటం సర్వసాధారణం. ఈ ఎన్నికలపై స్థానికులే కాదు.. ఇక్కడి నుంచి ఉద్యోగాలు, ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన వారు సైతం ఎక్కడ లేని ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడి సంగతులను ఆన్‌లైన్, వాట్సాప్ కాల్‌లో మాట్లాడి తెలుసుకోవడానికి ఉత్సుకత చూపుతున్నారు. వీరిలో చాలా మంది ఎన్నికల సమయానికి స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే కొంతమంది ఆయా పార్టీలపై అభిమానంతో వచ్చి, ప్రచార వ్యూహాలకూ తమ వంతు సహకారం అందిస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 440 మంది ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉన్నారు. వీరిలో ఒకరు థర్డ్‌జెండర్ కూడా ఉన్నారు. ఎన్నికల సంఘం అధికారికంగా విడుదల చేసిన జాబితాలోని లెక్కలివి. అత్యధికంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో 175 మంది, అత్యల్పంగా రాజానగరంలో 11 మంది చొప్పున ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు ఉన్నారు.

విదేశాల్లో ఉన్నా ఓటు వినియోగం

విదేశాల్లో ఉంటున్నా భారతీయులు ఓటు వేయడానికి అర్హులే. అక్కడి పౌరసత్వం లేని భారతీయ పౌరులు 18 ఏళ్లు నిండితే చాలు పాస్‌పోర్ట్‌లోని భారతదేశం చిరునామా వివరాలతో.. నమోదు చేసుకున్న ప్రాంతంలో నేరుగా ఓటు వేయవచ్చు. దీని కోసం ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలి. ఈఆర్‌ఓకు నేరుగా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఈఆర్‌ఓ చిరునామాకు పోస్టులోనూ పంపవచ్చు. పోస్టు ద్వారా పంపేవారు పాస్‌పోర్టు లోపలి పేజీ ఫొటో, వ్యక్తిగత వివరాలు ఉన్న పేజీని ఫొటో తీసి, చెల్లుబాటు అయ్యే వీసా వివరాలు జత చేసి పంపాలి. ఈ పత్రాలన్నింటినీ మన దేశ అధీకృత అధికారి ధ్రువీకరించాలి. ఈఆర్‌ఓకు వ్యక్తిగతంగా దరఖాస్తు ఇవ్వాలనుకుంటే ఒరిజినల్ పాస్‌పోర్ట్ సమర్పిస్తే పరిశీలన పూర్తయ్యాక ఇచ్చేస్తారు. పోలింగ్ రోజున అదే పాస్‌పోర్ట్ చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

వైఎస్సార్ సీపీతోనే అణగారిన వర్గాల అభ్యున్నతి

- మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు
- రాజకీయ, సామాజిక న్యాయం కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనని వెల్లడి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మూరి కనకరావు మాదిగ, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆశయాలకు అనుగుణంగా అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు మాదిగ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ రాజకీయాల్లో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మహనీయులు కోరుకున్న సామాజిక న్యాయాన్ని సాకారం చేస్తున్న ఘనత సీఎం జగన్‌దేనన్నారు. గతంలో చంద్రబాబు ఎస్సీలకు రెండు మంత్రి పదవులతో సరిపెడితే.. జగన్‌మోహన్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు మరో ఐదుగురికి కీలకమైన మంత్రివర్గ శాఖలు అప్పగించారని చెప్పారు. చంద్రబాబు హయాంలో ముస్లింలలో ఒక్కరికి కూడా మంత్రి పదవి కేటాయించలేదన్నారు. సీఎం జగన్ మాల మాదిగలకు సమ న్యాయం చేస్తూ రెండు కులాలనూ రెండు కళ్లుగా భావించి, అన్ని రంగాల్లోనూ ప్రాధాన్యం కల్పిస్తున్నారని అన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల అమలు ద్వారా పేదల ఖాతాల్లో నేరుగా రూ.2.70 లక్షల కోట్లు జమ చేశారన్నారు. డబ్బుకు అమ్ముడుపోయే కొద్దిమంది స్వార్థపరులు, కుహనా నాయకులు మాల మాదిగలను విడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని మంద కృష్ణమాదిగ కులాన్ని వాడుకున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు రెండు నాల్కల ధోరణిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని అన్నారు. విజయవాడలో రూ.2 వేల కోట్లు వెచ్చించి దళిత జాతి గర్వించే విధంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గానికి చెందిన గొల్ల బాబురావుకు ఎంపీ స్థానం కట్టబెట్టిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు వైఎస్సార్ సీపీకే పట్టం కట్టనున్నారని కనకారావు మాదిగ స్పష్టం చేశారు.

గోపాలపురం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు అభ్యర్థి తలారి వెంకట్రావు మాట్లాడుతూ, చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఎస్సీల అభ్యున్నతికి రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏకంగా రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఎస్సీలందరూ వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పిడి విజయరావు మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా సామాజిక న్యాయం అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రారంభం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) ర్యాండమైజేషన్ శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని జిల్లా స్ట్రాంగ్ రూమ్ కమ్ వేర్‌హౌస్ గోడౌన్‌లో ఈవీఎంల తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యాన శుక్ర, శనివారాల్లో నగరంలోని గోడౌన్‌లో ఈవీఎంల మొదటి విడత ర్యాండమైజేషన్ చేపట్టామన్నారు. ఈ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. తొలుత ర్యాండమైజేషన్ విధానంపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమగ్ర సమాచారం అందజేశామని తెలిపారు. జిల్లాకు కేటాయించిన 5,971 బ్యాలెట్ యూనిట్లు, 5,463 కంట్రోల్ యూనిట్లు, 4,927 వీవీ ప్యాట్ యూనిట్లను సాంకేతికంగా తనిఖీ చేసి, వాటి పని తీరును నిపుణులు నిర్ధారించారని, దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చామని కలెక్టర్ వివరించారు. ఒక్కో ఈవీఎం భద్రపరిచే బాక్సులో 10 యూనిట్లు ఉంటాయని, వాటిని ఒక టేబుల్ వద్దకు చేర్చి, ఒక్కో యూనిట్‌ను ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి చొప్పున ఏడింటికీ కేటాయించి, వాటి సీరియల్ నంబర్లను స్కాన్ చేస్తారని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి యూనిట్లు కేటాయించిన అనంతరం, వాటినీ ఆయా నియోజకవర్గాల స్థాయిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూములకు జీపీఎస్ ట్రాకింగ్ వాహనాల ద్వారా అత్యంత భద్రత నడుమ పంపిస్తామని చెప్పారు. తొలి రోజు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంల ర్యాండమైజేషన్ చేసి ఆయా నియోజకవర్గాలకు తరలించనున్నామని తెలిపారు. ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూము వద్ద రిటర్నింగ్ అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారని, సీసీ కెమెరాలు, అగ్నిమాపక చర్యలు తీసుకున్నారని కలెక్టర్ మాధవీలత చెప్పారు.



ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, రాజకీయ పార్టీల ప్రతినిధులు

క్లుప్తంగా

చురుగ్గా సత్యదేవుని నమూనా ఆలయ పనులు

22న ప్రారంభం



నమూనా ఆలయం గుమ్మం ముహూర్తంలో పాల్గొన్న పండితులు, అధికారులు

అన్నవరం: స్థానిక జాతీయ రహదారిపై సుమారు రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం పనులు చురుకుగా జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీన స్వామివారి నమూనా ఆలయంలో సత్యేదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే అధికారులు నిర్ణయించారు. దీంతో ఆలయ నిర్మాణ పనులు మరింత వేగంగా జరుగుతున్నాయి.

ఘనంగా గర్భాలయ గుమ్మం ముహూర్తం

దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం నమూనాలయ గర్భాలయ గుమ్మం ముహూర్తం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు పండితుల మంత్రోచ్చాటన మధ్య సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు ప్రధాన ద్వారం గుమ్మానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈఈ నరసింహారెడ్డి, ఏఈఓ కృష్ణారావు, డీఈ గుర్రాజు, ఆలయ నిర్మాణ కాంట్రాక్టర్ డీవీ సుబ్బరాజు పూజలు చేశారు. వచ్చే పది రోజుల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఓటరు జాబితాలో మీ పేరుందా?

- ఓటు లేకపోతే ఫారం-6 ద్వారా దరఖాస్తుకు అవకాశం
- ఓటును ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేయొచ్చు



ప్రత్తిపాడు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో అసలు ఓటరు జాబితాలో తన పేరు ఉందో? లేదో? అనే సందేహం కొందరిలో ఉంటుంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న భారత ఎన్నికల కమిషన్ జాబితాలో ఓటు వివరాలు ముందే తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది. జాబితాలో ఓటు లేదని గుర్తిస్తే వెంటనే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసే ఏప్రిల్ 25వ తేదీ వరకు అవకాశం కల్పించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా అనుబంధ జాబితాలో చేరుస్తారు.

అందుబాటులో ఓటర్ హెల్ప్ లైన్

ఓటరు జాబితాలను పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ), తహసీల్దారు కార్యాలయంలో ఇప్పటికే అధికారులు అందుబాటులో ఉంచారు. ఆయా అధికారిక కార్యాలయాలకు వెళ్లి జాబితాను పరిశీలించి, ఓటు హక్కు ఉందో... లేదో నిర్ధారించుకోవచ్చు. అలా కాకపోతే ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశాన్ని కూడా భారత ఎన్నికల సంఘం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓటర్ హెల్ప్ లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

స్మార్ట్ ఫోన్లలో ఓటర్ హెల్ప్ లైన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా ఓటరు వివరాలు తెలుసుకోవచ్చు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేయగానే ఆప్షన్లు వస్తాయి. సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే సెర్చ్‌బై కింద వచ్చిన ఆప్షన్లలో ఎపిక్ నంబర్ ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు.

ఫోన్ నంబర్‌తో అనుసంధానం ఇలా...

ఓటును మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు అనుసంధానం చేసుకోవడం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎవరైనా మీ ఓటును సవరించాలనో, తొలగించాలనో చూస్తే వెంటనే అనుసంధానం చేసుకున్న నంబర్‌కు సంక్షిప్త సమాచారం అందుతుంది. ఈ సౌలభ్యం పొందేందుకు వెబ్‌లింక్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. హెచ్‌టీటీపీ://సీఈసీఏపీఈఆర్ఎంఎస్.ఏపీ.జీవోవీ.ఎన్ లింకును తెరిచి, ఇందులో ఓటరు ఐడీ నంబర్ ఎంటర్ చేయాలి. దాని కిందనే ఫోన్ నంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. వెంటనే ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత ఓటర్ ఐడీకి ఫోన్ నంబర్ అనుసంధానమవుతుంది.

- కంప్యూటర్ ద్వారా ఓటర్ వివరాలు తెలుసుకునే హెచ్‌టీటీపీ://ఎలక్టోరల్‌సెర్చ్.ఈసీఐ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ ఓపెన్ చేయాలి. అందులో సెర్చ్‌బై ఎపిక్ నంబర్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి, ఓటర్ ఐడీ నంబర్, స్టేట్ అనే చోట ఆంధ్రప్రదేశ్ అని సెలెక్ట్ చేసుకోవాలి. క్యాప్చర్ కోడ్ ఎంటర్ చేసి సెర్చ్ ఆప్షన్‌ను క్లిక్ చేయగానే ఓటు వివరాలు కనిపిస్తాయి.
- ఓటు వివరాలు తెలుసుకునేందుకు 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం ఎన్నికల కమిషన్
- అందుబాటులో ఉంచింది. ఈ సంబర్‌కు ఫోన్ చేసి ఓటర్ ఐడీ నంబర్ చెబితే అక్కడి సిబ్బంది ఆన్‌లైన్‌లో పరిశీలించి ఓటు ఉందా లేదా అనే విషయం చెబుతారు.

లేకపోతే నమోదు చేసుకోవాలి

ఓటు లేదని తెలిస్తే వెంటనే ఓటరుగా నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. బీఎస్ఓ, తహసీల్దారు కార్యాలయంలో మాన్యువల్‌గా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటు ఉంది.

ఇద్దరి నుంచి రూ.12 లక్షల స్వాధీనం

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



సామర్లకోట మఠం సెంటర్‌లో తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: స్థానిక మఠం సెంటర్‌లోని యూనియన్ బ్యాంకు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది రూ.12,32,511 స్వాధీనం చేసుకున్నారు. మఠం సెంటర్‌లో మోటారు సైకిళ్లపై వేరు వేరుగా వెళుతున్న ఇద్దరిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జె.రామారావు ఆధ్వర్యంలో అనుమానంతో తనిఖీ చేశారు. అచ్చంపేట గ్రామానికి చెందిన యళ్ల రమేష్ ఎటువంటి ఆధారాలు లేకుండా రూ.7,28,611 నగదు కలిగి ఉండటంతో ఆయన వద్ద నుంచి సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. పీబీ దేవం గ్రామానికి చెందిన సందవోలు వీరవెంకట సత్యనారాయణమూర్తి నుంచి రూ.5,03,900 స్వాధీనం చేసుకున్నారు. యూనియన్ బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసి తీసుకొని వస్తున్న సమయంలో నగదును స్వాధీనం చేసుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలు ఉన్నా పోలీసులు పట్టించుకోలేదని సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలతో కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి సొమ్ము తెచ్చుకోవాలని చెప్పడం వింతగా ఉందని అన్నారు. 80 సంవత్సరాల వయసులో ఎండలో ఎక్కడ తిరుగుతానని, ఆధారాలను పరిశీలించి సొమ్ము ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సీఐ తీరును ఆయన తప్పు పట్టారు. ఎటువంటి ఆధారాలు లేకుండా స్వాధీనం చేసుకున్న నగదును పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి స్వాధీనం చేస్తామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామారావు తెలిపారు.

సత్యదేవుని ఉత్సవాలకు పంపాలో నీటి నిల్వలకు చర్యలు

కలెక్టర్‌కు దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్ లేఖ

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈ నెల 16 వ తేదీ నుంచి జరుగనున్న శ్రీరామనవమి వేడుకలకు, మే 18 వ తేదీ నుంచి జరుగనున్న సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు పంపా నదిలో తగినన్ని నీటి వనరులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ కాకినాడ జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. పంపానదిలో నీరు అడుగంటిన వైనంపై »సాక్షి« దినపత్రికలో ఈ నెల పదో తేదీన »ఎండిపోయినది« శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఈఓ పంపా నదిలో తగినంత నీటి నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరనున్నట్టు తెలిపారు. దాని ప్రకారం ఆయన శుక్రవారం రాసిన లేఖలో ఈ వేసవిలో సత్యదేవుని ఆలయానికి ప్రతి నిత్యం వేలాది మంది భక్తులు విచ్చేస్తారని తెలిపారు. దేవస్థానంలో నీటి సరఫరాకు పంపా నదిలో గల బోర్ల ద్వారా పంపింగ్ చేసే నీరే ఆధారమని తెలిపారు. ప్రస్తుతం పంపా నదిలో నీరు లేనందున భక్తులకు, దేవస్థానానికి ఇబ్బంది తప్పదని తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న పంపా నదిలో శ్రీచక్రస్నానం, సత్యదేవుని కల్యాణ మహోత్సవాలలో భాగంగా మే నెల 23వ తేదీన సత్యదేవుని శ్రీచక్రస్నానం కార్యక్రమాలకు పంపా స్నానఘట్టం వద్ద కనీసం నాలుగు అడుగుల మేర నీటి మట్టం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల ఏలేరు రిజర్వాయర్ నుంచి రోజు 200 క్యూసెక్కుల నీరు పంపాకు తరలించేలా ఆదేశాలివ్వాలని ఈఓ కోరారు.

లారీని ఢీకొని మోటార్ సైకిలిస్ట్ మృతి



మధు మృతదేహం

పెరవలి: నిడదవోలు-నరసాపురం ఆర్అండ్‌బీ రహదారిలో కానూరు వద్ద గురువారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన వసంతాడ మధు (20), నిడదవోలు మండల కలవచర్లలో తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై తన బంధువుల అబ్బాయి ముప్పిడి నాగ చరణ్‌తో కలసి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడపడటంతో పాటు వేగంగా వస్తుండగా సడన్ బ్రేక్ వేయటంతో వెనుక ఉన్న మోటార్ సైకిలిస్ట్ లారీ వెనుక ఢీకొట్టాడు. అతని తలకు బలమైన గాయం అవ్వటంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. చరణ్ తీవ్ర గాయాల పాలవ్వటంతో హుటాహుటిన 108లో తణుకులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మధు తల్లితండ్రులు పరాయి దేశంలో ఉపాధి కోసం వెళ్లారని ఎస్సై తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం లారీ డ్రైయివరేనని అతని నిర్లక్ష్యం వలనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. మృత దేహానికి శుక్రవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని తెలిపారు. మృతిని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ముమ్మిడివరం: మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన చిన్నం వీరబాబు, ఆయన భార్య సత్యదుర్గ మోటారు సైకిల్‌పై కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వెళ్లి తిరిగి వస్తుండగా మహిపాల చెరువు సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అమలాపురంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌ఓ జి.భైరవస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంగంపేట భవిత కేంద్రానికి రాష్ట్రంలో ప్రథమ స్థానం



విద్యార్థులతో ముచ్చటిస్తున్న అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాధిక

రంగంపేట: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను తీర్చిదిద్దటంలో రంగంపేట భవిత కేంద్రం రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాధిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీఎల్ఎం కిట్లు, ట్యాబుల వినియోగంలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల నమోదు, హాజరు నిలకడలో కృషి చేస్తున్న కేంద్ర నిర్వాహకులు, ఐఈఆర్టీలు ముద్రగడ ప్రసాద్, జి.అంజిల కృషిని ఆమె అభినందించారు. అనంతరం రికార్డులు, విద్యాబోధన తీరును ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కో-ఆర్డినేటర్ ఎస్.కన్నబాబు, మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు, సీఆర్ఎంటి ఎల్. శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థిని ప్రతిభ



బైపీసీ విభాగంలో 971 మార్కులు సాధించిన బుంగా ఈప జాస్మిన్

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థిని బుంగా ఈప జాస్మిన్ 971 మార్కులు సాధించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులలో జాస్మిన్ ఒకరు. గురుకుల కళాశాలలో జాస్మిన్ ప్రథమస్థానం సాధించగా, ఎంపీసీ విభాగంలో ఐ.స్ఫూర్తి 944 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్.లక్ష్మీ 943మార్కులతో తృతీయస్థానం సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ విభాగంలో 75మంది పరీక్షకు హాజరుకాగా 74మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో తొమ్మిది మంది 900 మార్కులు పైన సాధించారని ప్రిన్సిపాల్ ఏ.వాణికుమారి తెలిపారు.

గోడి గురుకులం విద్యార్థికి ఇంటర్‌లో 966 మార్కులు



ఇంటర్మీడియెట్ ఫలితాల్లో బైపీసీలో 966 మార్కులు సాధించిన నాగశ్రీ అశ్విని

అల్లవరం: విద్యా శాఖ విడుదల చేసిన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అల్లవరం మండలం గోడి బాలికల గురుకులం విద్యార్థి ఉప్పలగుప్తం మండలం కామరావుపేట ప్రాంతానికి చెందిన పెయ్యిల నాగశ్రీ అశ్విని బైపీసీ గ్రూపులో 966 మార్కులు సాధించి గురుకులాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో మంచి స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ కిరణ్మయి శుక్రవారం తెలిపారు. గురుకులం నుంచి 71 మంది పరీక్షలు రాయగా 73 శాతంతో 53 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 53 మందికి 49 మంది ఉత్తీర్ణత సాధించారని కిరణ్మయి తెలిపారు. జిల్లా స్థాయిలో గురుకులం విద్యార్థికి ఈ స్థాయిలో మార్కులు రావడం సంతోషంగా ఉందన్నారు. గోడిలోని బాలుర గురుకులంలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు 29 మంది పరీక్షలు రాయగా 79.3 శాతంతో 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో 36 మందికి 29 మంది విద్యార్థులు పాసయ్యారని తెలిపారు.

ఇంటర్ ఫలితాలలో ప్రభంజనం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్టు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కి 466 మార్కులు (12 మంది) జే.శ్రీసాయిబృంద, బి.ఉమాశ్రీ, కె.హేమంత్, కె.ప్రజ్ఞ, సీహెచ్ పూజిత సాయి, ఎస్.కావ్యశ్రీ, ఐ.పద్మప్రియ, ఎం.దీపికరాజ్‌కుమారి, ఎం.ఆయేషాసిద్దిఖ్, ఎ.పద్మిని, కె.సాయి సృజన, బి.యశ్వంత్‌లోవస్వామి సాధించారన్నారు. 464పైన 191మంది, 460పైన 732మంది, 450పైన 1,688మంది సాధించారని చెప్పారు. 98.85శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. బైపీసీ విభాగంలో 440కి 436మార్కులు నలుగురు విద్యార్థులు ఎల్.ప్రవల్లిక, ఆర్.సుచి, పి.సాయిఅవినాష్, ఎ.దివ్యమానస సాధించారని, 433పైన 62మంది, 430పైన 120మంది, 400పైగా మార్కులు 348మంది సాధించారని, 99.06 శాతం ఉత్తీర్ణత వచ్చినట్టు తిరుమలరావు తెలిపారు.

సీనియర్ ఇంటర్‌లో...

సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1,000 మార్కులకు కె.బేబిజాగృతికి 990మార్కులు, ఎం.దేవివైష్ణవికి 990, 15మంది విద్యార్థులకు 989, 110మందికి 985 మార్కులుపైన, 384మందికి 980మార్కుల పైన, 1,465 మంది విద్యార్థులు 950మార్కుల పైన సాధించారని, 99.88శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. బైపీసీ విభాగంలో 1,000 మార్కులకు గాను ఎస్.రాధాకృష్ణ 989 మార్కులు, ఎం.టిస్సాఫ్రాన్సిస్ 989, డి.నవీన్‌తేజ 989, పి.జ్ఞానశ్రీ 989 మార్కులు సాధించారని చెప్పారు. 58మంది 980పైన , 125 మంది 970పైన, 227మంది 950మార్కులు పైన సాధించారని, 99.03శాతం ఉత్తీర్ణత వచ్చిందని తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో తిరుమలరావు అభినందించారు. విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, విద్యాసంస్థల టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

14న భగవద్గీత అష్టావధానం



మీడియాతో మాట్లాడుతున్న పీఠం ఈసీ మెంబర్ సత్యనారాయణ, సభ్యులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యాన స్థానిక గౌతమ ఘాట్‌లోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో ఏప్రిల్ 14వ తేదీ సాయంత్రం 4 గంటలకు భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తామని రాజమహేంద్రవరం శాఖ ఈసీ మెంబర్ వనపర్తి సత్యనారాయణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పీఠం నవమ పీఠాధిపతులు సద్గురు డాక్టర్ ఉమర్ ఆలీషా స్వామి దివ్య ఆశీస్సులతో భగవద్గీత అష్టావధానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బల్లిపాడుకు చెందిన తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థి, అవధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు ఈ అష్టావధానం చేస్తారని తెలిపారు. వేదావధానం నుంచి కవితావధానం వచ్చిందని, ఎంతోమంది అవధానులు అష్టావధానాలు, శతావధానాలు, సహస్రావధానాలు చేశారని, ఇంకా చేస్తున్నారని ఆయన వివరించారు. అయితే భగద్గీతను అవధానంగా మలిచి ఉమామహేశ్వరరావు ఇప్పటివరకు 19వ అవధానాలు చేశారని, 20వ అష్టావధానం రాజమహేంద్రవరంలో చేస్తున్నారని ఆయన చెప్పారు. అవధాన ప్రాచార్య, పద్య కళాతపస్వి, ధూళిపాళ మహాదేవమణి సభా సంచాలకులుగా వ్యవహరిస్తారన్నారు. పీఠం శాఖ కార్యదర్శి డి.కృష్ణంరాజు మాట్లాడుతూ కవులకు, గౌతమఘాట్ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరిస్తామని తెలిపారు. పీవీఎస్ కష్ణారావు మాట్లాడుతూ ఈ సాహితీ కార్యక్రమానికి సాహితీ ప్రియులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.


మద్యం అక్రమ రవాణాపై నిఘా

- 87 మద్యం సీసాలు, 16.17 లీటర్ల ఐఎంఎల్ పట్టివేత
- ఏడుగురి అరెస్ట్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలో అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోంది. జిల్లా పోలీసు శాఖ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎస్ఈబీ బృందాలు ఎక్కడికక్కడ నిఘా వేసి అక్రమ రవాణాను అడ్డుకుంటున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాలతో జిల్లాలో ఈ బృందాలు దాడుల, తనిఖీలు చేసి మొత్తం 87 మద్యం సీసాలు, 16.17 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్ (ఐఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు, తనిఖీల వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరించింది.

- ఉప్పలగుప్తం, ఐ.పోలవరం పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన రెండు అక్రమ మద్యం కేసుల్లో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 20 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 3.09 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధుల్లో నమోదైన 7 అక్రమ మద్యం కేసుల్లో ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 5 నాన్ డ్యూటీ పెయిడ్
- మద్యం సీసాలు, 60 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 13.08 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.
- జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేట చెక్ పోస్టుల్లో అక్రమ రవాణాపై వాహనాలను నిలిపి విస్తృత తనిఖీ చేశారు.
- సమస్యాత్మక గ్రామాలైన అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, ద్రాక్షారామ మండలం జగన్నాయకులపాలెం, వేలంపాలెం గ్రామాల్లో ఆయా మండలాల పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే అంశాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఇంటర్ ఫలితాలలో సత్తా



వేలివెన్ను శశి ప్రాంగణంలో ఇంటర్ విద్యార్థినులను అభినందిస్తున్న శశి వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ

ఉండ్రాజవరం: ఇంటర్ ఫలితాలలో వేలివెన్ను శశి క్యాంపస్ విద్యార్థులు సత్తా చాటారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1,000 మార్కులకు గాను ఎం.నవ్యశ్రీ 990,, జి.పార్వతి 989, కె.లిఖిత 989, ఎస్ఎస్.దీపిక లక్ష్మి 988, వి.షణ్ముఖి లక్ష్మి 988, ఎం.హర్షిత్ 988, జి.తేజస్విని 988, జీఎస్‌వీఎస్ మణికంఠ అఖిల్ 987, కె.యశ్వంత్ నాయుడు 987, పి.శ్రీదత్త 987, కేడీకే లక్ష్మణ్ 987, కేఎన్ సందీప్ 987 సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 1,000 మార్కులకు గాను కేఎస్ సాయి శివాణి 987, ఎండి.అబ్దుల్ జాఫర్ 985 , కె.శ్రీహసని 984, జీవీ మౌనిక 983, ఎస్.న్యూటన్‌రాజు 982, కేడీఎస్‌రాజరాజేశ్వరి 981, కె.భవ్యశ్రీ 981, జి.నవ్యశ్రీ 981, ఎంపీ కృపాని 981 మార్కులు సాధించారని తెలిపారు. 985 మార్కులపైన 24 మంది, 980కు పైన 109 మంది, 950కు పైన 566 మంది, 900 మార్కులపైన 1,039 మంది సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను ఎం.లీలా కృష్ణారెడ్డి 466, డి.దుర్గా కౌసల్య 466, ఎస్.లక్ష్మి శ్రీవల్లి 465, ఎం.జాహ్నవి సాయి 465, షేక్ సబియా ఇర్ఫాత్ 465, బి.సహస్ర 465, బి.షన్మిత 465, టి. మనోజ్ఞ శ్రీ 465 సాధించినట్టు తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను టి.కీర్తి 435, పీవీ హాసిని 435, వి.ఖ్యాతి 435 మార్కులు, ఎం. నిస్సి క్రిసోలైట్ 435, సీహెచ్ తేజస్వి 435 మార్కులు సాధించారు. 464 మార్కుల పైన 26 మంది, 460కు పైన 155 మంది, 430కు పైన 950 మంది, 400కు పైన 1,453 మంది సాధించారని తెలిపారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.